
సీతామహాలక్ష్మి.. వరాలిచ్చే వరలక్ష్మి


లలితాసుందరీ దేవిగా చందోలు బండ్లమ్మ


శ్రీపార్వతీ దేవి అలంకరణలో..


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


గౌరీదేవిగా మోదుకూరు కనక దుర్గాంబ


పెద్దింటమ్మ ఆలయంలో అన్నపూర్ణగా..


ధనలక్ష్మి దేవిగా లలితాంబ


పేటేరులో గజలక్ష్మిదేవిగా మహాలక్ష్మి గుండెపాటెమ్మ


ఓల్డ్‌టౌన్‌లో మహాలక్ష్మిగా బూరుగులమ్మ

పిట్టలవానిపాలెం: అల్లూరు రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో గాయత్రీ దేవిగా అమ్మవారిని అలంకరించారు. చందోలులోని లింగోద్భవస్వామి ఆలయంలో పార్వతీ దేవిగా, బగళాముఖి అమ్మవారి దేవాలయంలో లలితా సుందరీ దేవిగా అమ్మవార్లను అలంకరించారు. బండ్లమ్మ దేవాలయ కమిటీ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, అల్లూరు శ్రీరాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వాలి వెంకట శివారెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాపట్ల అర్బన్: స్థానిక లలితా త్రిపుర సుందరీ పీఠం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అంజనేయ స్వామి దేవాలయంలోని నవరాత్రి పూజా మండపంలో గురువారం గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. గాయత్రీ దేవికి సర్వోపచారాలతో కుంకుమార్చన, పుష్పార్చనలు గావించి, గాయత్రీ మంత్ర పఠనం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్నవారికి ఆయురారోగ్య ఐశ్వర్యములు చేకూరతాయని పీఠ నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు అమ్మవారి విశిష్టతను తెలియజేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చన, పూజాకార్యక్రమాలలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలలో పంగులూరి కౌండిన్య శర్మ, దర్శి ప్రశాంత్, వక్కలగడ్డ బాలాజీ, భక్తులు పాల్గొన్నారు.

మోదుకూరులో..

మోదుకూరు(వేమూరు): చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలోని శ్రీ కనకదుర్గాంబ సమేత రామచౌడేశ్వరి దేవస్థానంలో గురువారం ఐదవ రోజు గౌరీదేవిగా అమ్మ వారు భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను అర్చకులు మామిళ్ల నాగేశ్వర శర్మ నిర్వహించారు.

అన్నపూర్ణాదేవిగా..

కర్లపాలెం: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలలో 5వ రోజు అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవిగా పూజలందుకున్నారు. మండల కేంద్రంలోని కాళికాంబ ఆలయం, ఆర్యవైశ్య కల్యాణ మండపం, పెద్దింటమ్మ ఆలయం, కొత్త నందాయ పాలెంలోని శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయం, నల్లమోతువారి పాలెంలోని లలితా త్రిపుర సుందరీ ఆలయంతో పాటు పలు గ్రామాలలో శరన్నవరాత్రుల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి.

ధనలక్ష్మి దేవిగా శ్రీ లలితాంబ అమ్మవారు

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు గ్రామంలో కొలువైన స్వయంభువేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం లలితాంబ ధనలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకు మార్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

ప్రత్యేక అలంకారాల్లో అమ్మవార్లు

భట్టిప్రోలు: భట్టిప్రోలు హిందూ శ్మశాన వాటికలో కొలువైన శ్రీ గుండిపార్వతీ అమ్మవారు ఐదవ రోజు గురువారం లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించగా యర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. వెల్లటూరులో అశ్వత్థ నారాయణ శ్రీ మహాలక్ష్మి దేవతా వన వృక్షం వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భట్టిప్రోలు మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భ్రమరాంబ అమ్మవారు స్కంద మాతగా దర్శనమిచ్చారు. కుమార స్వామికి తల్లిగా అమ్మవారు దర్శనమిస్తారు. భక్తులను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని అనుగ్రహించే తల్లి విజ్ఞానాన్ని ప్రసాదిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కార్యక్రమాలను దేవాలయ కార్య నిర్వాహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు. భోగేశ్వరపేటలో శ్రీ కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర నామావళితో పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పెదపులివర్రు గ్రామ దేవత గోగులమ్మ తల్లి రౌద్ర రూప మహా చండీ స్వరూపిణిగా దివ్య దర్శనమిచ్చారు. భట్టిప్రోలులో వాసవీ, పార్వతీ అమ్మవార్లు లలితాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. రాత్రి శక్తి స్వరూపిణి దుర్గాదేవి ఆవాహనంతో 2 నుంచి 10 సంవత్సరాలు వయస్సు కలిగిన 9 మంది చిన్నారులకు కుమారి పూజలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలను కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా, దేవస్థానం మహిళా కమిటీ నిర్వాహకులు పాలకుర్తి నిర్మల మానేపల్లి శశికళ, మానేపల్లి వెంకట హృదయ ధనలక్ష్మి, తూనుగుంట్ల ఆళ్వార్ హారికలు పర్యవేక్షించారు.


స్కంద మాతగా భమరాంబ అమ్మవారు


మహా చండీ స్వరూపిణిగా..

రేపల్లె: దేవీ శరన్నవ రాత్రి వేడుకల్లో భాగంగా పట్టణంలోని పలు దేవాలయాలలో గురువారం 5వ రోజు అమ్మవార్లు సిరుల తల్లి శ్రీ మహాలక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఓల్డ్ టౌన్‌లో వేంచేసిన గ్రామ దేవత బూరుగులమ్మ, ఇసుకపల్లిలో చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో వేంచేసియున్న భ్రమరాంబ అమ్మవారు, మండలంలోని పేటేరు గ్రామంలో వేంచేసియున్న మహాలక్ష్మి గుండెపాటమ్మ అమ్మవార్లు మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో కోవెలలకు చేరుకుని అమ్మవార్లను దర్శించుకని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయాల కమిటీల సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా స్వయంభూరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆర్యవైశ్య మహిళలతో ఏర్పాటు చేసిన బతుకమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి వివిధ రకాల పండ్లు, స్వీట్లతో సారె సమర్పించి మహిళలు హారతులుపట్టారు.

ఇంటి వద్దకే వైద్యం

రావికంపాడు(కొల్లూరు): జగనన్న ఆరోగ్య సురక్షతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటి వద్దకే వైద్యం అందిస్తోందని మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు అన్నారు. రావికంపాడులో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 566 మందికి వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో సత్యన్నారాయణ, సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, 104 సిబ్బంది, వలంటీర్లు పాల్గొని సేవలు అందించారు.

కైతేపల్లిలో 360 మందికి వైద్య పరీక్షలు

రేపల్లె రూరల్: కై తేపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మోళ్లగుంట పీహెచ్‌సీ వైద్య బృందం 360 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేసింది. శిబిరాన్ని సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు మండలి అంజయ్య ప్రారంభించారు. ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు పోటుమెరకలో..

జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ శుక్రవారం పోటుమెరక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివ పార్వతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మోదుకూరులో..

మోదుకూరు(వేమూరు): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చుండూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఇందిర ప్రియదర్శిని అన్నారు. మోదుకూరు గ్రామ సచివాలయం-2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 825 మంకి వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. దీర్ఘ కాలిక వ్యాధులకు ప్రత్యేక వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుగుణమ్మ, డాక్టర్లు ప్రేమచంద్, శ్రావణి పాల్గొన్నారు.


మోదుకూరులో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ఇందిర

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

నగరం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. మండలంలోని ఈదుపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ పర్యవేక్షించారు. వైద్య శిబిరంలో 712 మందికి వైద్య పరీక్షలు జరపగా 101 మందిని మెరుగైన వైద్య పరీక్షల నిమిత్తం రిఫర్ చేసినట్లు డాక్టర్ భవానీశ్రీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్ డాక్టర్ తులసి రాజేశ్వరి, సీహెచ్‌వో బాబురావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రావెల్ టోకెన్లు దుర్వినియోగం చేస్తే చర్యలు

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు జారీ చేస్తున్న గ్రావెల్ టోకెన్లను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం జీఎంసీ ఇంజినీరింగ్, హౌసింగ్, మైనింగ్ డిపార్ట్‌మెంటు అధికారులు, ఎమినిటీ కార్యదర్శులతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత లే అవుట్స్ వారీగా ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతులు, బిల్స్ చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాల్ని ప్రస్తావించారు. టోకెన్ల ద్వారా వచ్చే గ్రావెల్‌ను కాంట్రాక్టర్లు జగనన్న లే అవుట్స్‌లోనే వినియోగించేలా చూడాలని, దుర్వినియోగం చేస్తే వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే వారిపై పోలీసు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. పీఎఫ్ఎంఎస్ కోడ్ జనరేట్ కాని వారి వివరాల్ని హౌసింగ్ ఎండీ కార్యాలయంతో సంప్రదించి పరిష్కరించాలని ఈఈని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ పనుల్ని ఎప్పటికప్పుడు బిల్స్ కోసం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎస్ఈ భాస్కర్‌ను ఆదేశించారు. ఆర్డీవో ప్రభాకరరెడ్డి, మైనింగ్ డీడీ. సుబ్రహ్మణ్యేశ్వరరావు, నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, వెంకట కృష్ణయ్య, ఈఈలు సుందరరామిరెడ్డి, శ్రీనివాస్, హౌసింగ్ ఈఈ శంకరరావు, నగరపాలక సంస్థ, హౌసింగ్, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఈఎస్ఐ కార్డుల పంపిణీ

నగర పాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు గురువారం నగర మేయర్ క్యాంపు కార్యాలయంలో ఈఎస్ఐ కార్డులు అందజేశారు. గత ఆగస్టు 23, 24, 25 తేదీల్లో కార్యాలయంలో శిబిరాన్ని నిర్వహించారు. కార్మికులంతా కుటుంబ సభ్యులతో పాటు వచ్చి ఆధార్ కార్డుల్ని అప్డేట్ చేసుకున్నారు. అయితే, శిబిరానికి వచ్చిన కార్మికులు కొంతమంది ఇంత వరకు ఈఎస్ఐ కార్డులు లేవని ఇవ్వలేదని మేయర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఆయన ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ సిబ్బందితో మాట్లాడారు. వారు వెంటనే స్పందించి 250 మంది పారిశుద్ధ్య, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించిన కార్మికులకు ఈఎస్ఐ కార్డులు మంజూరు చేశారు. కార్మికులంతా ఈఎస్ఐ వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

రేపల్లె: చోరీ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు పట్టణ సీఐ నజీర్‌బేగ్ తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 28న పట్టణంలోని పెనుమూడి రోడ్డులోని నబీసా సౌండ్స్ దుకాణంలో రూ.3.5లక్షల విలువైన డీజే బాక్స్‌లతో పాటు పలు వస్తువులను అపహరించిన కేసులో చీరాల మండలం ఈపురుపాలేనికి గ్రామానికి చెందిన ఆరికాటి మహేష్‌ను వెల్లటూరు సెంటరులో అరెస్ట్ చేసినట్లు చెప్పారు. చోరీలో పాలుపంచుకున్న మరో నిందితుడు సలగల సుధీర్‌ను త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. నిందితుడు మహేష్‌ను కోర్టులో హాజరుపరిచామన్నారు. వస్తువులను రికవరీ చేసి బాధితులకు అప్పగించామన్నారు.

క్లుప్తంగా

నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు

పిట్టలవానిపాలెం: మండలంలోని అల్లూరు, అలకాపురం, మండేవారిపాలెం, అల్లూరు శివారు రెడ్లపాలేనికి 3ఫేజ్ నిరంతరాయ విద్యుత్ సరఫరాకు పనులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదేశాల మేరకు 33 బై 12 కేవీ పిట్టలవానిపాలెం సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్‌ను ఏర్పాటు చేసి, లైను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ గ్రామాలలో విద్యుత్ పోల్సు ఏర్పాటుకు సర్వే పూర్తయిందని త్వరలో పనులు ప్రాంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు దెందుకూరి సీతారామరాజు, అలకాపురం గ్రామ సర్పంచ్ మంతెన గంగరాజు, అల్లూరు మాజీ సర్పంచ్ బదుగు ప్రకాశరావు, అల్లూరు సొసైటీ చైర్ పర్సన్ మండే విజయ్‌కుమార్ ఉన్నారు.

'నూర్ బాషా సింహ గర్జన'ను విజయవంతం చేయండి



బాపట్ల: ఆంధ్రప్రదేశ్ నూర్ బాషా దూదేకుల-ముస్లిం-సంక్షేమ సంఘం ఈ నెల 29న తలపెట్టిన ''నూర్ బాషా-సింహగర్జన''ను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్.ఫరీద్ అన్నారు. బాపట్లలోని ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో సింహగర్జన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫరీద్ మాట్లాడుతూ నూర్ బాషాలకు రాజకీయ చట్ట సభల్లో అవకాశం కలిప్పించాలని కోరారు. నూర్ బాషా సంఘం ఆధ్వర్యంలో తీసుకోవాల్సిన కార్యచరణపై సింహగర్జన్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గుంటూరులోని ఆంధ్ర ముస్లిం కళాశాల్లో జరిగే ఈ సింహగర్జన్‌లో నూర్ బాషా కులస్తులందరు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్.నాగూర్‌వలి, విశ్రాంత తహసీల్దారు ఎస్.సిద్ధయ్య, ఎస్.సుభాని, ఖాసీమ్, మీరావలి, మస్తాన్‌వలి, మహబూబ్ సుభాని, నాగూర్ వలి, షేక్.బాజీ, బాబావలి పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె క్లస్టర్ ఏరియా కో-ఆర్డినేటర్ పి. రమాదేవి



భట్టిప్రోలు: స్వయం సహాయక సంఘాలు జీవనోపాధి కోసం వైఎస్సార్ క్రాంతి పథకం ద్వారా అందజేస్తున్న వివిధ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని రేపల్లె క్లస్టర్ ఏరియా కో-ఆర్డినేటర్ పి. రమాదేవి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం రెండవ రోజు విజన్ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడారు. రమాదేవి మాట్లాడుతూ స్త్రీ నిధి ఉన్నతి, ఎస్‌జీఎస్‌వై, సీఐఎఫ్ పొదుపు, బ్యాంక్ రుణాలను సంఘ సభ్యులు సమానంగా పంచుకోకుండా సూక్ష్మ, ఆర్థిక రుణ ప్రణాళికలు తయారు చేసుకోవాలని కోరారు. సభ్యులు, సంఘాల మధ్యలో సంపద శ్రేణిని గుర్తించి సభ్యుల అవసరాల ప్రాధాన్యం మేరకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, సీసీలు కొలకలూరి రజని కుమారి, కొండెపాటి సాంబయ్య, దాసరి హనోకు, అకౌంటెంట్ బత్తుల శిరీష, అన్ని గ్రామాల ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

నగరంపాలెం: తెలంగాణ మద్యం సీసాలు విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సెబ్ గుంటూరు ఎస్ఈబీ -1 స్టేషన్ సీఐ ఎం.రమేష్ తెలిపారు. బ్రాడీపేటలోని స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. గుంటూరు ఎస్ఈబీ -1, ఆర్పీఎఫ్ సంయుక్తంగా గురువారం ఉదయం గుంటూరు జీజీహెచ్ ప్రధాన ద్వారం వద్ద అమరావతి రోడ్డు టిలికంనగర్‌కు చెందిన పి.రామమోహనరావును, సంపత్‌నగర్‌లోని పార్వతీపురం రెండో వీధికి చెందిన కె.సురేంద్రను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు చెప్పారు. తెలంగాణకు చెందిన 83 మద్యం సీసాలను గుర్తించి, అరెస్టు చేసినట్లు సీఐ రమేష్ తెలిపారు.